క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న పాస్టర్ సునీత

మలక్‌పేట: ఆంధ్ర తెలంగాణ ఒరిస్సా ఆర్చ్ డయోసిస్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాంకార్డియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. హౌస్ ఆఫ్ జీసస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన ఆర్చ్ బిషప్, సినమ్ అధ్యక్షులు మోస్ట్ రెవరెండ్ డాక్టర్ రాబిన్‌సన్ డేవిడ్ లూథర్ చేతుల మీదుగా మలక్‌పేటకు చెందిన పాస్టర్ సునీతకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

ధ్యానాంజనేయ స్వామికి సీఎం సోదరుడి పూజలు



ఎనుముల కొండల్‌రెడ్డితో ఆలయ ఈఓ లావణ్య, కమిటీ సభ్యులు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారిని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కొండల్‌రెడ్డిని ఆశీర్వదించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ లావణ్య, పాలక మండలి చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సభ్యులు తోకటి కిరణ్, గోపాల్‌రెడ్డి, కవిత, సంతోష్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



నాగోలు: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా నియమితులైన రామచంద్రరావును శనివారం నాగోలు డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు ఎల్లవంతుల చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న వాకర్స్ క్లబ్ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆరోగ్యం పట్ల అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని చిత్రలేవుట్ కాలనీ వాకర్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఇంద్రసేనరెడ్డి, రామచంద్రరావు అన్నారు. శనివారం ఆర్‌కే పురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీ పార్క్‌లో ఇంటర్నేషనల్ వాకర్స్‌క్లబ్, చిత్రలేవుట్ 301 చార్టర్ ఆధ్వర్యంలో ముత్తూట్ ఫైనాన్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయాలన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న పలువురి రిమాండ్

హస్తినాపురం: దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకుని తిరుగుతున్న పలువురిని రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పాపిరెడ్డికాలనీకి చెందిన మన్నెం సందీప్ ఇంట్లో ఈ నెల 6న దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు అందుకున్న పోలీసులు రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం జహంగీర్‌నగర్‌కాలనీకి చెందిన మహ్మద్ అహ్మద్(22) ర్యాపిడో డ్రైవర్, సూర్యాపేట తాళ్లగడ్డకు చెందిన షేక్ ఆజాం ముజామిల్ (19), వనస్థలిపురం సచివాలయనగర్‌కు చెందిన చిలుకూరి మనీష్(20) ఫొటో గ్రాఫర్‌తో పాటు ఓ మైనర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. వీరి నుంచి 17 తులాల బంగారు ఆభరణాలు రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాగోలు: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..ఎల్‌బీనగర్ చౌరస్తాలో గుర్తు తెలియని వ్యక్తి (65) పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.



వనస్థలిపురం ఆస్పత్రి..
సమస్యలతో కుస్తీ

- మహేశ్వరం వైద్య కళాశాల పరిధిలోకి ఆసుపత్రి..
- ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న వెల్‌నెస్ సెంటర్ తరలింపునకు చర్యలు



ఆసుపత్రి ప్రాంగణంలో కంకరతేలిన రోడ్లు

వనస్థలిపురం: ప్రభుత్వ ఆస్పత్రులలో మౌలిక వసతులు లేక రోగులు, సహాయకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వనస్థలిపురంలోని 100 పడకలతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఎల్‌బీనగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల నుంచి నిత్యం వందలాదిగా ప్రజలు వివిధ రుగ్మతలపై చికిత్స కోసం వస్తుంటారు. అలాగే ప్రసవాల కోసం సైతం వస్తుంటారు. అలాంటి ఏరియా ఆసుపత్రిని మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న 100 పడకలను 220కి పెంచే దిశగా వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. అవసరమైన సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. మెడికల్ కళాశాలకు అవసరమైన మార్పులు, చేర్పులు చేస్తున్నారు. దాదాపు 16 విభాగాలకు చెందిన సుమారు 120 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇతర వైద్య నిపుణులు నియమితులయ్యారు.



పార్కింగ్ స్థలం లేక ఆస్పత్రి ముందు వాహనాల నిలిపివేత

భవనం సరిపోక..

2000లో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిని ప్రారంభించారు. ప్రస్తుతం మూడు అంతస్థులతో ఉన్న భవన సముదాయంలో 1,00,000 ఎస్‌ఎఫ్‌టీ వాడుకలో ఉంది. కాగా ఆసుపత్రి భవనంలో కొంతమేర ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్‌కు కేటాయించారు. దీంతో పాటు ఇటీవల ఆసుపత్రిని మహేశ్వరం మెడికల్ కళాశాలకు అనుసంధానం చేయడంతో భవనం సరిపోని పరిస్థితి నెలకొంది. ఆసుపత్రి భవనంలో ఉన్న ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ సెంటర్‌ను వేరే చోటుకి తరలిస్తే కొంతమేర స్థలం కలిసొస్తుందని అధికారులు భావిస్తున్నారు.

ఇటీవల కలెక్టర్ సందర్శన

జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి 10 రోజుల క్రితం ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రి మెడికల్ కళాశాల సూపరిండెండెంట్ డా.నాగేందర్, ఆర్‌ఎంఓ జయమాల తదితర వైద్య సిబ్బందిని అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డా.నాగేందర్ మెడికల్ కళాశాలకు సంబంధించి సీటిస్కాన్, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు స్థలం లేదని, ఆక్సిజన్ ప్లాంట్‌కు సరిపోయే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెల్‌నెస్ సెంటర్‌ను సమీపంలోని మోడల్ మార్కెట్‌లోకి తరలించాలని, ఆ స్థలంలో సీటీ స్కాన్, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వెల్‌నెస్ సెంటర్ తరలిస్తే ఇబ్బందులే..

కలెక్టర్ ఆదేశాలతో ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న వెల్‌నెస్ సెంటర్ స్థలంలో సీటీ స్కాన్, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు ఆసుపత్రి అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న వెల్‌నెస్ సెంటర్ పరిధి కుదించి అందులోనే ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే వెల్‌నెస్ సెంటర్‌ను సమీపంలోని మోడల్ మార్కెట్ భవనంలోకి మార్చాలని ప్రతిపాదన ఉన్నా తమకు ఇంకా ఎలాంటి అధికారిక ఉత్తర్వులు రాలేదని సెంటర్ ఇన్‌చార్జి పేర్కొన్నారు. మోడల్ మార్కెట్ చిన్న చిన్న షాపులుగా నిర్మించారని, అందులో కూడా మొదటి అంతస్తును మాత్రమే వెల్‌నెస్ సెంటర్‌కు కేటాయిస్తామని అధికారులు చెపుతున్నారని. దీంతో వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చే సీనియర్ సిటిజెన్స్, ఉద్యోగస్తులు, జర్నలిస్టులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

పార్కింగ్ లేక..

దాదాపు 25 సంవత్సరాల క్రితం ఏరియా ఆసుపత్రి నిర్మాణం జరిగింది. అప్పుడు ఆసుపత్రి ప్రాంగణంలో చుట్టూ వేసిన రోడ్డు ఇప్పుడు కంకరతేలి అధ్వానంగా మారింది. గతంలో కట్టిన టాయిలెట్లు శిథిలావస్థకు చేరుకోవడమే కాకుండా సరిపోని పరిస్థితి నెలకొంది. ఆసుపత్రిలో ఇంత వరకు సరైన తాగునీటి సౌకర్యం లేదు. కరోనా సమయంలో రేకులతో నిర్మించిన మూడవ అంతస్థులో లీకేజీలు ఏర్పడ్డాయి. నిత్యం ఆసుపత్రికి వచ్చే దాదాపు 1000 మంది, ఆసుపత్రి వైద్యులు సిబ్బంది, మెడికల్ కళాశాలకు చెందిన దాదాపు 270 మంది సిబ్బంది, వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చే దాదాపు 300 మంది వాహనాలకు సరిపడా పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

రెడ్‌క్రాస్ సొసైటీలో చేరాలి



యువతకు సభ్యత్వం అందజేస్తున్న నరసింహారెడ్డి

మలక్‌పేట: సామాజిక కార్యకర్తలు, యువతీ యువకులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరాలని రంగారెడ్డి జిల్లా చైర్మన్ ఎస్. నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. దిల్‌సుఖ్‌నగర్ శాలివాహన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో శనివారం రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన లైఫ్ మెంబర్‌షిప్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదాన, ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు, టీబీ రహిత తెలంగాణ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని రెడ్ క్రాస్ చైర్మన్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ క్రమంలో సొసైటీని మరింత బలోపేతం చేయడానికి కమిటీ సభ్యుల బృందం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న సాంబ

మలక్‌పేట: పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఈనెల 15,16,17, తేదీలలో చేపట్టనున్న పోస్టుకార్డు ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ పిలుపునిచ్చారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల ముఖ్య నాయకుల సమావేశం శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాపాలన పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ల విడుదల చేయడంలో మొద్దు నిద్రపోతుందని విమర్శించారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి విద్యారంగ సమస్య పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో సైదులు, వంశీ, శ్రీకాంత్, అరుణ్, కార్తీక్, నాని, వీరేష్, శివుడు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మినీ వ్యాన్ దగ్ధం



నాగోలు: ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి మినీ వ్యాన్ దగ్ధమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా, చౌటుప్పల్ మండలం, దండు మల్కాపురంకు చెందిన శ్రీ జయ లొబొరేట్‌కు చెందిన ఆటో టీఎస్ 30టీ 5827లో డ్రైవర్ సురేష్ శనివారం పటాన్ చెరులోని మరో ల్యాబరేట్‌కు మెడిసిన్‌కు వాడే రా మెటీరియల్ (కెమికల్) సామగ్రి లోడ్‌తో వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఇంజిన్‌లో సమస్య రావడంతో టాటా కంపెనీకి ఫోన్ చేయడంతో షోరూమ‌కు వచ్చి రిపేరు చేయించుకోవాలని చెప్పాడంతో నాగోలు రేడియల్ రోడ్డు నమ్రి ఎల్‌బీనగర్ ప్రాంతంలో టాటా కంపెనీ షోరూమ్‌కు వెళ్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన సురేష్ వెంటనే వాహనం నుంచి దిగి ప్రమాదం నుండి తప్పించుకున్నాడు.

ఓపెన్ జిమ్ ప్రారంభం



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: చదువులు, పనుల ఒత్తిడితో ఉండే యువత మానసిన ఉత్సాహానికి వ్యాయాయం ఎంతో అవసరమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ పరిధి సౌత్ ఎండ్‌పార్కు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను శనివారం ఆయన కార్పొరేటర్ చింతల అరుణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా కనీసం అరగంట పాటు వ్యాయామం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతల సురేదర్‌యాదవ్, తూర్పాటి చిరంజీవి, దూగుంట్ల నరేష్, భాస్కర్‌యాదవ్, కాలనీవాసులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఫ్లోరింగ్ పనులు ప్రారంభం



పనుల ప్రారంభోత్సవంలో కమిటీ ప్రతినిధులు

చాదర్‌ఘాట్: మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల మంజూరు చేయించిన రూ. 2.50 లక్షల నిధులతో ఓల్డ్‌మలక్‌పేటలోని శ్రీపోచమ్మ దేవాలయంలో ఫ్లోరింగ్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆలయంలో మరమ్మతు పనుల కోసం ఎమ్మెల్యే బలాల, ఓల్డ్‌మలక్‌పేట కార్పొరేటర్ షఫి సహకరించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శంకర్ ముదిరాజ్, తులసి సురేష్‌కుమార్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, ముప్పిడి శ్రీనివాస్, చౌకి రవికుమార్, శ్రీధర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



ఏఈకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని ఆనందనగర్ రోడ్ నెంబర్ 4లో వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించాలని నాగోలు బీజేవైఎం జనరల్ సెక్రటరీ శ్రీనారాయణం తారక్‌శర్మ, నాగోలు డివిజన్ బీజేపీ అధ్యక్షులు పంగా శ్రీకాంత్ నాగోలు డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆనంద్‌నగర్‌లో తరుచూ విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకంగా మారుతున్నాయని వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సూచించారు. సైదాబాద్ బస్తీలోని నాగులమ్మ దేవాలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ పరిశీలించారు. సీసీ రహదారి పనులతో డ్రైనేజీల మ్యాన్‌హోళ్లు ధ్వంసమయ్యాయని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆమె పనులు పూర్తయ్యేలోపు మ్యాన్‌హోళ్లను సరి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సైదాబాద్‌లోని ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములు కావాలన్నారు.

ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దాలి



దేవాలయంలో అభివృద్ధి పనులు ప్రారంభించిన శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: బోనాల మహోత్సవాలు పురస్కరించుకొని అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి సూచించారు. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఎన్ రెడ్డినగర్‌లోని శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. బోనాల సందర్భంగా పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం ఆలయాల వద్ద సౌకర్యాలు కల్పించాలన్నారు. భక్తుల కోసం క్యూలైన్లు, తాగునీటి వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయాల పరిసరాల్లో మెరుగైన పారిశుద్ధ్యం కోసం తగిన చర్యలు తీసుకోవాలని ఆలయాల కమిటీల ప్రతినిధులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మధుకర్‌రెడ్డి, మురళీధర్ రావు, కృష్ణారావు, ఆనంద్, జగన్‌రెడ్డి, అంజయ్య, సరస్వతి, మాధవి, దీపిక పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి



నిరసన తెలుపుతున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది

వనస్థలిపురం: అవుట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలని, అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న సిబ్బందిని వెంటనే క్రమబద్ధీకరించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ శాంతికుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ రాష్ట్ర అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న అన్ని విభాగాల ఉద్యోగుల మహా ధర్నాకు సంఘీభావంగా వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి వద్ద ఏరియా ఆసుపత్రి సిబ్బంది, వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు హీబా, అనిత, ఫార్మసిస్టులు జగదీష్, నాగరాజు, వాసవి, ప్రసన్న, డీఈవోలు దిలీప్, సంధ్య, సరిత, భార్గవి, సిబ్బంది నర్సింగ్, నరసింహారెడ్డి, అనిల్, ఫయాజ్ పాల్గొన్నారు.

మాదిగలకు మేయర్ క్షమాపణ చెప్పాలి



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మలక్‌పేట: సామాజిక ఉద్యమాలు చేసి విజయం సాధించిన చరిత్ర ఎమ్మార్పీఎస్‌కు దక్కిందని ఆ సంస్థ హైదరాబాద్ జిల్లా నాయకులు టీవీ నరసింహారావు మాదిగ, యడవల్లి యాదయ్య మాదిగ అన్నారు. ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బంజరాహిల్స్ ఎన్‌బీటీ నగర్‌లో జెండా ఆవిష్కరణ కోసం ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ దిమ్మెను కూల్చివేతకు ఖండిస్తూ శనివారం మూసారంబాగ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మెను కూల్చివేసిన చోటనే మరో దిమ్మె కట్టించాలన్నారు. మాదిగలను దూషించిన, కూల్చివేతలకు కారణమైన నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి మాదిగలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. మేయర్ పదవి నుంచి ఆమెను బర్తరఫ్ చేసి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైలపాక రాంచందర్‌మాదిగ, దేవరాజ్‌మాదిగ, అశోక్‌మాదిగ, నరేష్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న సూర్య ప్రసాద్

సైదాబాద్: మలక్‌పేట నియోజకవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించి వారి సంక్షేమానికి కృషి చేస్తానని మలక్‌పేట వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోషియేషన్ (ఎండబ్ల్యూజేఏ) అధ్యక్షుడు ఎస్‌పీ కృష్ణ సూర్యప్రసాద్ పేర్కొన్నారు. శనివారం సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన అసోషియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.ఈ సమావేశంలో రవికుమార్‌గౌడ్, డి.లక్ష్మీకాంత్, జోగు చంద్రసాగర్, ఎస్.హంసరాజ్, జి.సాయికుమార్, జి.అవినాష్ నాయుడు, బి.హరీష్ రెడ్డి, బి.ముత్యాలు, మధుసూదన్‌రెడ్డి, కరీముద్దీన్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

హస్తినాపురం: సమాజ సేవ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, వీ ఫౌండేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్ యాదవ్ ఏర్పాటు చేసిన వి ఫౌండేషన్ పోస్టర్‌ను తన కార్యాలయంలో ఎంపీ ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తనకు తోచిన విధంగా తమ వంతు సేవ చేయడం ద్వారా సమాజానికి సేవచేసి దేశభక్తిని చాటు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ జగన్‌గౌడ్, వీ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు జంగయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి అంజనేయులు గౌడ్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఇళ్ల కూల్చివేతలను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

హయత్‌నగర్: మూసీనది కలుషితం అయిందని ప్రక్షాళన పేరుతో ప్రభుత్వం నది వెంట నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేస్తే ఊరుకోమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హయత్‌నగర్ డివిజన్‌లోని కుమ్మరికుంట చెరువు కట్టపై రోడ్డును శనివారం ఆయన పరిశీలించారు. మూసీ నీటిని శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన చేసిన ఎస్‌టీపీ ప్లాంట్ల నిర్వహణ సరిగ్గా లేకపని చేయడం లేదని మూసీ ప్రక్షాళనపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎస్‌టీపీ ప్లాంట్లను బాగు చేయించాలన్నారు. హయత్‌నగర్‌లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో చెరువుల పూడిక తీత మరుగు నీరు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీ వెంట కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, సామరంగారెడ్డి, భాస్కర్, ఎల్లప్ప, శ్రీను, ప్రేమ్‌నాథ్, శ్రీనివాస్, జంగయ్య ఉన్నారు.

డివిజన్ల అభివృద్ధికి సహకరిస్తా

మన్సూరాబాద్: మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని డివిజన్ల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీలో శనివారం ఆయన కార్పొరేటర్ చింతల అరుణతో కలిసి మార్నింగ్‌వాక్‌లో స్థానిక సమస్యలపై ఆరా తీశారు. అనంతరం కాలనీ కమ్యూనిటీహాల్‌లో జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ నియోజకవర్గంపై సంపూర్ణ అవగాహన ఉందని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తానన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, వినోద్‌రెడ్డి, సామ రంగారెడ్డి, చింతల సురేందర్‌యాదవ్ పాల్గొన్నారు.